ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-04-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

ముఖ్యాంశాలు

- కృత్రిమ మేధస్సుని వినియోగించడం ద్వారా నేర పరిశోధన ప్రక్రియలో పురోగతిని సాధించ వచ్చునని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు.

- అయిదేళ్ళ రాష్ట్ర భవిష్యత్ ను నిర్ణయించే ఎన్నికలలో ప్రజలు నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు

- పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మారుస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి అన్నారు.

========================

అయిదేళ్ళ పాలనలో ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలను అందించామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లాలోని చింతపాలెంలో ఈ రోజు జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పేదలకు మంచి చేసి చూపించామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఈసారి జరిగే ఎన్నికలు సమాజంలోని అన్నీ వర్గాల ప్రజల అయిదేళ్ళ భవిష్యత్తుని నిర్ణయించేవని అభివర్ణించారు. ఈ రోజు ఉదయం అనకాపల్లి జిల్లా గోడిచర్ల నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర నక్కపల్లి, పులవర్తి, యలమంచిలి బైపాస్ మీదుగా అచ్యుతాపురం, నరిసింగపల్లి మీదుగా చింతలపాలెంకు చేరుకుంది. కాగా ఈ రోజు రాత్రికి చిన్నయపాలెంలో జగన్మోహనరెడ్డి బస చేయనున్నారు.

========================

కృత్రిమ మేధస్సుని వినియోగించడం ద్వారా నేర పరిశోధన ప్రక్రియలో పురోగతిని సాధించ వచ్చునని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ, మూడు క్రిమినల్ చట్టాలు-భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగ్రిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం

అమలులోకి రావడంతో నేర పరిశోధనలో గణనీయమైన మార్పులు జరుగుతాయని అన్నారు. క్రిమినల్ ట్రయల్స్‌లో ట్రాక్ చేయడానికి న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధస్సుని అనుమతిస్తామని పేర్కొన్నారు.

========================

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు “ఎక్స్” వేదికగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఒక అనుభవజ్ఞుడైన నాయకుడని, ఆయన నిత్యం ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతుంటారని ప్రధాని కొనియాడారు. ప్రజల సేవలో ఆయన దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా జీవించాలని ప్రార్ధిస్తున్నానని మోదీ తెలిపారు. అలాగే జనసేన అధినేత కె.పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సంతోషాలు అందించాలని భగవంతుణ్ణి ప్రార్ధిస్తున్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తన పుట్టిన రోజు సందర్భంగా ఈ రోజు ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరులో చంద్రబాబు మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

========================

యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి సూచించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కాకినాడలోని స్థానిక డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో దేశాభివృద్ధికి ఓటు చాలా కీలకమని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా ఓటు వేయాలని, చిత్తశుద్ధి గల అభ్యర్థులను ఎన్నుకోవాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య కసరత్తులో యువత పాల్గొనాలని ఆయన కోరారు.

========================

వేసవి రద్దీని తట్టుకోవడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేర్ డివిజన్ 52 వేసవి ప్రత్యేకరైళ్లను నడుపుతోందని డివిజినల్ రైల్వే కమర్షియల్ మేనేజర్ ఏ.కే. త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటుగా 12 జతల అదనపు రైళ్లను నడపడానికి సన్నద్ధమైనట్లుగా వెల్లడించారు. ఒక నిర్దిష్ట మార్గంలో రైళ్ల అవసరం ఆధారంగా రైళ్ల సంఖ్యను అలాగే ట్రిప్పుల సంఖ్యను పెంచుతామని తెలిపారు. కాగా, రైల్వే స్టేషన్లలో తాగునీటి లభ్యత ఉండేలా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

========================

కడప లోక్ సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ రోజు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కడప పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ రామరాజుకు ఆమె తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

విరామం

========================

ఎన్నికల సంఘం నిబంధన మేరకు గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేసే అభ్యర్థులు అనర్హులవుతారని ఏలూరు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు షెరింగ్ జోర్డెన్ భూటియా, మేష్రమ్ గౌరవ్ మధుకర్, పి.కీర్తి నారాయణ్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు తదితర అంశాలపై అభ్యర్థులు తెలియజేసిన వ్యయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించుకోవాలన్నారు.

========================

సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు పెట్టే ఖర్చుల వివరాలను ఖచ్చితత్వంతో లెక్కించాలని విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకులు రంగ రాజన్ ఏఈఓలను ఆదేశించారు. ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విశాఖ పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రంగ రాజన్ మాట్లాడుతూ, పోటీలో ఉండే అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసా కూడా ఎన్నికల వ్యయంలోకే వస్తుందన్నారు. ఎన్నికల వ్యయం లెక్కింపులో పనిచేసే బృందాల నుంచి ఎప్పటికపుడు వివరాలు సేకరించాలని, వాటిని సంబంధిత పట్టికల ద్వారా ఎన్నికల వ్యయ రిజిష్టరులో నమోదుచేయాలని సూచించారు.

========================

పార్వతీపురం మన్యం జిల్లాలో మే 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టుగా రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు తెలిపారు. ఈ రోజు పార్వతీపురం కోర్టు ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కక్షిదారులు పాల్గొని పెండింగులో ఉన్న కేసులకు పరిష్కారం చూపవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

========================

ఎన్నికల విధులలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ హెచ్చరించారు. ఈ రోజు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలకు ఇచ్చిన వాహనాలకు అనుమతి కాపీని తప్పనిసరిగా అతికించాలన్నారు. అనుమతులు లేని వాహనాలను వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. కాగా, రాజకీయ పార్టీలు ప్రచార సమయంలో బాణాసంచా కాల్చేందుకు ఎలాంటి అనుమతులు లేవని కలెక్టర్ స్పష్టం చేశారు.

========================

అల్ప పీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరవతిలోని భారత వాతావరణకేంద్రం తెలిపింది. అలాగే ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ద్రోణి ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుండి ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నదని వెల్లడించింది. ఇదిలా ఉండగా, ద్రోణి ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాల్లో ఈదురు గాలులు గంటకు 30-40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వివరించింది.

========================

అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా పలు మండలాలలో ఈ రోజు వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పలు చోట్ల ఓ మోస్తరు వర్షం పడడంతో ప్రజలతో పాటు రైతాంగం ఆనందం వ్యక్తం చేసింది. గత వారం రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం కురియడంతో ఉపశమనం పొందారు.

========================

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని కోదండరామస్వామి వారి ఆలయంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లుగా దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఒంటిమిట్ట శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ సాయంకాలం 6 గంటల

30 నిమిషాల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాల మధ్య జరిగే శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు.

========================

ఉమ్మడి కర్నూల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 26న శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం నిర్వహిస్తున్నట్లుగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరెడ్డి తెలిపారు. గుమ్మడి కాయలు, కొబ్బరి కాయలు, నిమ్మకాయలు, అన్నరాశి సమర్పించేందుకు ఈ వార్షిక కుంభోత్సవం నిర్వహిస్తారని వివరించారు.

========================

========================